క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో మహాశివుడికి సోమవారం పట్టణానికి చెందిన యుగంధర్‌రెడ్డి, మాధవీరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రైతుల అభివృద్ధే ధ్యేయం



సొసైటీ ఆవరణలో మొక్క నాటిన కేడీసీసీ సీఈఓ విజయభాస్కర్

పాములపాడు: ప్రతి రైతు మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నదే సహకార సొసైటీల ధ్యేయమని కేడీసీసీ సీఈఓ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేంపెంట గ్రామంలోని సింగిల్ విండో సొసైటీలో సోమవారం అంతర్జాతీయ సహకార దినోత్సవం, మన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి, ఆత్మకూరు మేనేజర్ పులిరాజు, సూపర్‌వైజర్ రసూల్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఆశావర్కర్ల ధర్నా

నందికొట్కూరు: ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన తలపెట్టిన ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ కిరణ్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు అందజేశారు. ఆశావర్కర్లు మహాలక్ష్మి, వెంకటలక్ష్మి, విజయమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగించండి

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో చెత్తాచెదారం లేకుండా చేయాలని ఎంపీడీఓ నూర్జహాన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రధాన రహదారుల వెంట చెత్తాచెదారం ఉంటే ఉపేక్షించేదిలేదన్నారు. నందికొట్కూరు నుంచి 80 బన్నూరు వరకు కర్నూలు–గుంటూరు రహదారి వెంట చెత్తాచెదారం లేకుండా పంచాయతీ కార్యదర్శులు శుభ్రంగా ఉంచాలన్నారు.

పల్లకీసేవ రద్దు

మహానంది: మహానంది ఆలయ పరిసరాలతో పాటు సమీప గ్రామాల పరిధిలో సోమవారం రాత్రి చిరుజల్లులు కురిశాయి. దీంతో సోమవారం రాత్రి మహానందిలో జరగాల్సిన పల్లకీసేవ రద్దు అయినట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

తరిగోపులలో విషజ్వరాలు

జూపాడుబంగ్లా: తరిగోపుల గ్రామానికి చెందిన బోయపేటవాసులు ఉదార్‌బీ, హేమంత్, మధుగోపాల్, ముర్తుజాబీ, షేక్‌మున్నిసా విషజ్వరాల బారిన పడటంతో చికిత్స నిమిత్తం నందికొట్కూరు, కర్నూలు ఆసుపత్రులకు తరలించినట్లు కాలనీవాసులు తెలిపారు. రోడ్డుపై ఇళ్లముందు నిల్వ ఉన్న మురుగునీటి వల్ల దోమలు వ్యాపించి, విషజ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని మురుగునీటిని తొలగించాలని కోరుతున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

మహానంది: వివాహమైన తొమ్మిది నెలలకే అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, మామలపై ఓ వివాహిత ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గాజులపల్లెకు చెందిన హైమావతికి గోస్పాడు మండలం కాండ్లపల్లెకు చెందిన నరసింహులుతో గతేడాది నవంబర్‌లో వివాహమైంది. అయితే ఇటీవల అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని భర్త నరసింహులు, మామ నారాయణలపై హైమావతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు 498ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

బొల్లవరం గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ ఇంటి వద్ద బండలు పాతే విషయంపై జరిగిన గొడవలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఇంటి స్థలం వద్ద నాగలక్ష్మమ్మ బండలు పాతుకుంటుండగా అదే గ్రామానికి చెందిన మధుకృష్ణ, బాలమనోహర్‌లు దూషించి గొడవకు దిగారన్నారు. నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

సంగమేశ్వరంలో కేరళ భక్తుల పూజలు



కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమ ప్రాంతంలో కృష్ణానది ఒడ్డున వెలసిన ప్రాచీన సంగమేశ్వరంలో సోమవారం కేరళ భక్తులు విశేష పూజలు చేసుకున్నారు. ప్రాచీన ఆలయంలోని వేపదారు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.



మహానంది మండలం బుక్కాపురంలో వైఎస్సార్ జయంతి వేడుకలు



జూపాడుబంగ్లాలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం



బండిఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పగిడ్యాలలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య



లక్ష్మాపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పిస్తున్న అభిమానులు

ప్రజల గుండెల్లో వైఎస్సార్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్
- వాడవాడలా వైఎస్సార్ జయంతి
- మహానేతకు ఘన నివాళి

నందికొట్కూరు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్ద పీట వేసి ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని కర్నూలు రహదారిలో, పాతబస్టాండ్, కోటవీధిలో, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. వైఎస్సార్ ఆశయాలు కొనసాగిద్దామని పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. డాక్టర్ దారా సుధీర్ మాట్లాడుతూ ప్రాంతాలకు, కుల మతాలకు, పార్టీలకు అతీతంగా వైఎస్సార్ అందించిన సంక్షేమ పథకాలు మరవలేనివన్నారు. రైతు పక్షపాతిగా, రైతు మేలు కోరిన నేతగా రైతుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించారన్నారు. జలయజ్ఞం పేరుతో 32 వేల ఎకరాలకు సాగు నీరు అందించామని గుర్తు చేశారు. రైతులకు రుణమాఫీ చేసి వైఎస్సార్ చరిత్రలో నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, కౌన్సిలరు షేక్ నాయబ్, పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు లోకేష్‌రెడ్డి, శివరామ కృష్ణారెడ్డి, ఉపేంద్రారెడ్డి, కోకిల రమణారెడ్డి, జబ్బార్, నాగిరెడ్డి, తులసిరెడ్డి, శివనాగిరెడ్డి, వెంకటస్వామి, భాస్కరరెడ్డి, లక్ష్మిరెడ్డి, మండ్లెం రమణ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్‌చేసి సంబరాలు

పాములపాడు/జూపాడుబంగ్లా/కొత్తపల్లి: పాములపాడు, జూపాడుబంగ్లా, 80బన్నూరు, కొత్తపల్లి గ్రామాల్లోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, నియోజకవర్గం ఇన్‌చార్జ్ దారా సుధీర్‌లు పూల మాల వేసి నివాళ్లులర్పించారు. కేక్‌కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. అలాగే మండలంలోని మద్దూరు గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలతో, ఇస్కాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణతో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పాములపాడు మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, కార్యదర్శి మధు, మాజీ ఎంపీటీసీ చౌడయ్య, సర్పంచులు కోట్ల చంద్రారెడ్డి, వరప్రసాద్, ఎంపీటీసీ బషీరాహ్మద్, మాజీ సర్పంచు బాలునాయక్, నాయకులు బాలీశ్వరరెడ్డి, బాలసుబ్బారెడ్డి, యుగంధర్‌రెడ్డి, జూపాడుబంగ్లా జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, యుగంధర్‌రెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, పీఎం నాగిరెడ్డి, వైవి.రమణ, పుల్లయ్య, కృష్ణ, దినేష్, వినయ్, కొత్తపల్లి జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ (రంగ), సర్పంచులు బాల ఎల్లయ్య, కలబండి మారెన్న, ఎంపీటీసీలు సోమల స్రవంతి, పెరుమాళ్ల శివన్న,కో–ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్ గౌస్,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ మాజీ చైర్మన్లు రామసుబ్బారెడ్డి, గౌరు జనార్దన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీమహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ స్మృతి వనంలో మహానేత విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి తదితరులు

పేదల హృదయాలను గెలిచిన నేత

ఆత్మకూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జనహృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నేత అని శ్రీశైలం వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణ, మండలాధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్ రెడ్డి, వెలుగోడు మండలాధ్యక్షులు అంబాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పావురాలగుట్ట పరిధిలోని నల్లకాల్వ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ స్మృతివనం వద్ద దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్సార్ అధికారం చేపట్టిన వెంటనే రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఉచిత విద్యుత్ అందించి విద్యుత్ సమస్యలను తొలగించారన్నారు. వైద్యానికి పెద్దపీట వేస్తూ ఆరోగ్యశ్రీ, 108 సేవలు ప్రవేశపెట్టి పేదల హృదయాలను గెలుచుకున్నారన్నారు. ఈ ప్రాంతంలో కరువును తరిమికొట్టేందుకు సిద్ధాపురం ఎత్తిపోతల పథకంతో పాటు ఇస్కాల, లింగాల, చెలిమల, మాడుగుల ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసి వేల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేశారని గుర్తు చేశారు. అంతకముందు ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి వైఎస్సార్ జోహార్, అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. అనంతరం అభిమానులు వైఎస్సార్ స్మృతివనానికి చేరుకుని ర్యాలీగా చేరుకున్నారు. కరివేన గ్రామంలో వైఎస్సార్ విగ్రహాలకు ఆ పార్టీ నాయకులు పాలాభిషేకం, పూలమాలలు వేసి దివంగత నేతకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం తిరుపంరెడ్డి, కలిముల్లా, సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, శివశంకర్‌నాయక్, నాగేశ్వరరెడ్డి, రవినాయక్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూర ఉత్సవాలు

పగిడ్యాల: దివంగత ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి ఉత్సవాలను సోమవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట తదితర గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. పగిడ్యాలలోని వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ పుల్యాల దివ్య, పార్టీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైస్ ఎంపీపీ బోరెల్లి శ్యామలమ్మ, ఎంపీటీసీ కళావతి, మండల కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, సహకార సొసైటీ డైరెక్టర్ దివాన్‌సాహెబ్, పార్టీ నాయకులు నాగశేనారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అమ్మిరెడ్డి, అంబటి శివశంకర్‌రెడ్డి, నారాయణ, ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడులో..

వెలుగోడు: వైఎస్సార్ 75 వ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మహానేత వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బల్లాని వెంకట సత్యనారాయణ, జబివుల్లా, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, నాయకులు అచ్చయ్య, ఖాద్రీ, వంగాలనాగేశ్వరరెడ్డి, తెలుగు శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ దారా సుధీర్, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమ ప్రదాత వైఎస్సార్

మహానంది: పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన సంక్షేమ ప్రదాత వైఎస్సార్ అని శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. మహానంది మండలం బుక్కాపురం, బండిఆత్మకూరు మండల కేంద్రంతో పాటు ఈర్నపాడు, శింగవరం, లింగాపురం, తదితర గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ 75వ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, మహానంది మండల బూత్ కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు దీప్‌కాంత్‌రెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, బుక్కాపురం సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, ఉప సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, బీసీ సంఘం కన్వీనర్ గజ్జ పెద్ద పక్కీరయ్య, యర్రగుంట్ల పెద్ద వెంకటరాముడు, మాజీ ఉపసర్పంచ్ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

సున్నిపెంటలో మహానేత జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: మహానేత వైఎస్సార్ జయంతిని సున్నిపెంటలో వైఎస్సార్‌సిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణంలోని విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు జూటూరి.మహమ్మద్ ఖాసీం, భరత్‌రెడ్డి, బూదాల.దానియేల్, వి.ఎం.ఎం.ప్రవీణ్, బక్కన్న ఆటో.మల్లి, ఆంజనేయులు, మర్రిపూడి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ



కరివేన వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేయిస్తున్న బుడ్డా శేషారెడ్డి

ఆత్మకూరురూరల్: దింగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం ఆత్మకూరు మండలంలోని కరివేన శివారులో ఉన్న ఎస్ఆర్‌బీసీ కాలనీలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి ఆధ్వర్యంలో రగ్గుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన వృద్ధులతో కేక్ కట్ చేయించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోకారి, శివన్నగౌడు,జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వెలుగోడులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పేదలకు న్యాయం చేయడమే లక్ష్యం

నందికొట్కూరు: ప్రతి పేదవాడికి న్యాయం చేయడమే తమ లక్ష్యమని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ బైరెడ్డి శబరికి ఘనస్వాగతం పలికారు. ఓటు వేసి గెలిపించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో మహిళాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, అబ్దుల్ షకూర్, శ్రీధర్‌రెడ్డి, కాకర వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

ఫర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

నందికొట్కూరు /జూపాడుబంగ్లా: ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ దుకాణాల్లో అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తే ఉపేక్షించమని సెంట్రల్ టీం డీడీఏ సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పల్లవి సీడ్స్, మల్లికార్జున సీడ్స్, జూపాడుబంగ్లా మండలంలోని జూపాడుబంగ్లా, 80బన్నూరులోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల తనిఖీలు నిర్వహించారు. నందికొట్కూరులోని పల్లవి సీడ్స్‌లో రికార్డులు చూపించకపోవడంతో బీఏఎస్ఎఫ్ రకం విత్తనాలు విక్రయించకుండా నిలుపుదల చేశారు. రూ.5.61 లక్షల విలువ విత్తనాలు, మందులకు రికార్డులు లేవని వారు తెలిపారు. జూపాడుబంగ్లాలోని వెంకటేశ్వర ఫెస్టిసైడ్స్, మనగ్రోమోర్ దుకాణాలను తనిఖీ చేశారు. వెంకటేశ్వర పురుగుమందుల దుకాణంలో రూ.1,19,400ల బయోస్టిములెన్స్‌ల విక్రయాలను నిలిపివేశారు. అలాగే మనగ్రోమోర్ సెంటర్‌లో పాత ఎరువుల సంచులను నిల్వ ఉంచటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని దుకాణంలోంచి తీసివేయాలని లేని ఎడల చర్యలు తప్పవని హెచ్చరించారు. 80బన్నూరు గ్రామంలోని మహాలక్ష్మి ఎరువుల దుకాణంలో స్టాకు ఉండి పీసీలు లేని రూ.50,791ల స్టాకు విక్రయాలను నిలిపివేశారు. వీరి వెంట ఏడీఏలు విజయశేఖర్, రాజశేఖర్, డీఏఓ కళ్యాణ్, అయూబ్‌బాషా తదితరులు ఉన్నారు.



నందికొట్కూరులో పల్లవి సీడ్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ అధికారులు

హెల్మెట్ ధరించి వాహనం నడపాలి

నందికొట్కూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సోషల్ వర్కర్ శోభారాణి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై మండల్ లీగల్ సరీ్వస్ కమిటీ, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రయదర్శిని ఉత్తర్వుల మేరకు ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయడం ప్రాణాలకు ముప్పన్నారు. ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవాలంటే తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సోషల్ వర్కర్ శోభారాణి

ఉచిత ఇసుక ప్రగతికి బాట

ఆత్మకూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక రాష్ట్ర ప్రగతికి బాట అని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. ఈ విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభిస్తుందన్నారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే పేదలు వెంటనే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించుకోండి

జూపాడుబంగ్లా: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో లిఖితపూర్వకంగా ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే సత్వరమే వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటి పట్టాలు ఇవ్వాలి

నందికొట్కూరు: కర్నూలు రోడ్డు బైరెడ్డి నగర్‌లో 15 ఏళ్ల నుంచి గుడిసెలు వేసుకున్ని జీవనం సాగిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని నూర్జహాన్, లక్ష్మిదేవి, వెంకటమ్మ, నారాయణ, ఈడిగ లక్ష్మిదేవి, పార్వతమ్మ, సుగుణమ్మ, వెంకటేశ్వరమ్మ తదితరులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినత పత్రం అందజేశారు.

వర్షం కురిపించాలని..

జూపాడుబంగ్లా: వర్షం కురిపించాలని మండలంలోని 80బన్నూరు గ్రామప్రజలు గ్రామంలోని దేవతామూర్తులకు బిందెలతో నీటిదారలు పట్టారు. సోమవారం తప్పెట్లతో గ్రామంలోని వినాయక, ఈశ్వర, ఆంజనేయ, వెంకటేశ్వర తదితర దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి 501బిందెలతో నీటిదారలు పోశారు. అలాగే జూపాడు ఆంజనేయస్వామి, ఈశ్వర, శ్రీసీతారాములు, జంబులాపరమేశ్వరీ అమ్మవార్లకు బిందెలతో నీటిని పోసి వర్షం కురిపించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగిరెడ్డిపై ఆరోపణలు తగవు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ ఏఐటీయూసీ నాయకులు నాగిరెడ్డిపై, జిల్లా యూనియన్ నుంచి తొలగించబడిన వెంకటశివుడు చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకోవాలని యూనియన్ సీనియర్ నాయకుడు ఓబులయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వెంకటశివుడిపై ఆరోపణలు రావడంతో అతనిని ఏఐటీయూసీ నుంచి తొలగించామన్నారు. ఆ కోపంతో ఆయన ఏఐటీయూసీ నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు పులిరాజు, అన్వర్‌బాష, రమేష్, ప్రసన్న లక్ష్మి, సుహాసిని పాల్గొన్నారు.

మల్లన్నకు శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైనశ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్లను వెండిరథం పై ఆశీనులు చేసి ఆలయ ప్రదక్షిణ చేయించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు,అర్చకులు,ఆలయసిబ్బంది పాల్గొన్నారు.



స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు,అధికారులు

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో భారీగా అంతర్గత బదిలీలు జరిగాయి. ఏకకాలంలో 52 మందిని అంతర్గతంగా బదిలీ చేస్తూ దేవస్థాన ఈఓ పెద్దిరాజు ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మొట్టమొదటిసారిగా భారీగా అంతర్గత బదిలీలు చేపట్టారు. దేవస్థానంలో పనిచేసే రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను బదిలీలు చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం అంతర్గత బదిలీ చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో ఈఓ పేర్కొన్నారు. బదిలీ అయిన ఉద్యోగులు తమకు కేటాయించిన స్థానాల్లో తక్షణమే చేరాలని ఆదేశించారు.

అధ్యాపకులను నియమించాలి

నందికొట్కూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు, డిగ్రీ కళాశాలలకు అధ్యాపలకును వెంటనే నియమించాలని పీడీఎస్‌యూ జిల్లా కన్వీనర్ ఆది డిమాండ్ చేశారు. సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న అధ్యాపకులకు తక్షణమే రెన్యూవల్ చేయాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు జగదీష్, గణేష్, రాజ్‌కుమార్, శివ, మాణిక్యం. ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'ను అమలు చేయాలి

కొత్తపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ఏపీ రైతు సంఘం ఆత్మకూరు మండల కార్యదర్శి కేతం వెంకటశివుడు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మనగ్రోమర్ సెంటర్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంమైనందున రైతులు పంటల సాగుకు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మావేశంలో రైతులు వెంకటరత్నం ఆచారి, మోక్షేశ్వరుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరు: ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. సోమవారం బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నల్లకాలువ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పనిసరిగా కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలన్నారు. చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, సీహెచ్ఓ శివకుమార్, ఆరోగ్య కార్యకర్త భాస్కర్ పాల్గొన్నారు.

మిడుతూరు: కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజు ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులచే గ్రామ పురవీధుల గుండా ర్యాలీగా వెళ్లి బస్టాండు కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రంగస్వామి, ఏఎన్ఎం జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి ప్రాథమి ఆరోగ్యకేంద్రం పరిధిలోని నందికుంట గ్రామంలో అంగన్వాడీ సెంటర్లో వైద్యురాలు దీపానాగవేణి, సీహెచ్ఓ బాలకృష్ణయ్య ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు వ్యాధులపట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.